క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఏర్పాట్లను ఈఓ డి.రామకృష్ణంరాజు పర్యవేక్షించారు.

బ్యానర్లు, జెండాల తొలగింపు



సచివాలయ భవనంలో పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొగల్తూరు: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వానికి సంబంధించిన భవనాలు, కార్యాలయాలపై ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించే పనులు చేపట్టారు. ఆదివారం మొగల్తూరు పంచాయతీ సిబ్బంది అధికారుల పర్యవేక్షణలో సచివాలయాల భవానాలపైన ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు, కటౌట్, పార్టీల జెండాలను కూడా తొలగిస్తామన్నారు.

శరవేగంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు



సిమెంట్ రోడ్డు పనులు నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఏనుగువానిలంక గ్రామంలో రెండో విడత గడప గడపకూ మన ప్రభుత్వ నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఏనుగువానిలంక మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు వినుకొండ రవి చెప్పారు. గ్రామంలో నిర్మిస్తున్న రోడ్డు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. గత ఐదేళ్లలో ఏనుగువానిలంకలో ప్రతి వార్డులో అభివృద్ధి చేశామన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత జగనన్నది అన్నారు. మళ్లీ సంక్షేమ పథకాలన్నీ తమ ఇంటికే రావాలంటే ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఆయన కోరారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు



యలమంచిలి మండలం దొడ్డిపట్లలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం రాకుండా, ప్రజల్లో నైతిక స్థైర్యం నింపడానికి పారా మిలటరీ బలగాలతో ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఎస్సై కాకి శివనారాయణ ఆధ్వర్యంలో సుమారు 200 మంది ఈ కవాతులో పాల్గొన్నారు. కంచుస్తంభంపాలెం, బూరుగుపల్లి, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం గ్రామాల్లో ఉదయం, మధ్యాహ్నం మేడపాడు, అడవిపాలెం, కొంతేరు గ్రామాలలో ఈ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కాకి శివ నారాయణ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికే ఈ కవాతు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, ధైర్యంగా ముందుకు వచ్చి ఓటేయాలని ఆయన కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

భీమవరం: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, జి.ఆస్కారరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఈసీ సభ్యుల సమావేశం ఆదివారం భీమవరంలోని అంకాల ఆర్ట్ అకాడమీ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయి నుంచి సంఘాన్ని మరింత పటిష్టం చేసుకోవాలన్నారు. సమావేశంలో జి.సత్యనారాయణ, రమేష్ కుమార్, నాగ సాయి, బీహెచ్ రవీంద్ర రాజు, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఆస్తి

- ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్
- అక్క చెల్లెమ్మలకు దస్తావేజుల అప్పగింత



కొత్తపేట గ్రామ సచివాలయంలో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు పేదలకు వరమయ్యాయి. ప్రతి పేదవాడికి ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం నిర్మించి ఇస్తామన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ నూటికి నూరు శాతం నెరవేరింది. భారతదేశ చరిత్రలో 32 లక్షల మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మిస్తున్న చరిత్ర వైఎస్సార్ ప్రభుత్వానికి దక్కుతుందని పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో చాలా ప్రాంతాల్లో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో జగనన్న కాలనీల్లో వేగంగా నిర్మాణాలు సాగుతున్నాయి. మండలంలోని దగ్గులూరులో 165 జాతీయ రహదారికి ఆనుకుని పేదలకు ఇంటిస్థలం పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించింది. ఇప్పుడు వాటి విలువ రూ.10 లక్షలపై మాటే నని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాలకొల్లు మండలంలో ఆగర్రు శివారు చిట్టివానిగరువు, శివదేవునిచిక్కాల, కాపవరం, అరట్లకట్ట గ్రామాల్లో జగనన్న కాలనీల నిర్మాణం జరుగుతోంది. పాలకొల్లు పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మేడపాడు, కొంతేరులో ఇంటిస్థలాలు కేటాయించారు. వీటిలో మేడపాడులో జగనన్న లే అవుట్‌లో ఇంటి స్థలాల నిర్మాణాలు సాగుతున్నాయి. శివదేవునిచిక్కాల, కొంతేరు లే అవుట్‌లలో పూడిక పనులు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌లతో హక్కు పదిలం

ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరుపైనే గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేశారు. అనంతరం దస్తావేజులను కూడా అప్పగిస్తున్నారు. భవిష్యత్‌లో లబ్ధిదారులు వారి ఆర్థిక అవసరాలకు క్రయ, విక్రయాలు జరుపుకునే విధంగా హక్కులు కల్పించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రూ.10 లక్షల విలువైన ఆస్తిని తమకు అప్పగించినట్లేనని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కొంతమంది లబ్ధిదారులు మరణించడం వల్ల, అలాగే మరికొంతమంది ఉపాధి నిమిత్తం గల్ఫ్‌దేశాలు వెళ్లడం వల్ల కొన్ని రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. భవిష్యత్‌లో ఆయా స్థలాల రిజిస్ట్రేషన్ చేయనున్నారు. తమకు రిజిస్ట్రేషన్ హక్కులతో స్థల దస్తావేజులను అందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌లు ఇలా..

మండలం	లబ్ధిదారులు	రిజిస్ట్రేషన్‌ల పూర్తి
పాలకొలు	2260	1847
యలమంచిలి	2564	1740
పోడూరు	2323	1798

త్వరలో నిర్మించుకుంటాం



మేము చాలా ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. నెలకి రూ.4 వేలు అద్దె కట్టడానికి ఇబ్బంది పడ్డాం. నా భర్త శ్రీను తాపి పని చేసి మమ్మల్ని పోషిస్తున్నారు. శివదేవునిచిక్కాల జగనన్న లే అవుట్‌లో నాకు ఇంటి స్థలం వచ్చింది. అక్కడ పూడిక పనులు పూర్తికాగానే ఇంటి పని మొదలు పెట్టుకుంటాం. ఇంటిస్థలం రిజిస్ట్రేషన్‌చేసి ఇవ్వడం ఆనందంగాఉంది. నాకు వైఎస్సార్ చేయూత పథకంలో లబ్ధి చేకూరింది.
– శీలం మహాలక్ష్మి, కొత్తపేట

జగనన్నకు రుణపడి ఉంటా



నా భర్త నాగేశ్వరరావు మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. నా కుమార్తె డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. విద్యాదీవెన, విద్యావసతి పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత పథకంతో పాటు పింఛన్ అందుతోంది. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు అండగా ఉంటాం.
– బాసిన సరోజిని, దిగమర్రు

గోరీలగుంట అభివృద్ధి



గోరీలగుంట ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న పురావస్తు శాఖ అధికారులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న గోరీలగుంట స్థలాన్ని అభివృద్ధి చేయడానికి పురావస్తు శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఆదివారం గోరీలగుంట ప్రాంతాన్ని పురావస్తు శాఖ అధికారులు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు మాట్లాడుతూ గతంలో డచ్ వారు మన ప్రాంతాన్ని పరిపాలించేవారు. అప్పుడు వారి సమాదులు ఇక్కడ ఉండేవి. వాటిని తవ్వకాలు చేసినప్పుడు వచ్చిన కొన్ని అవశేషాలను విజయవాడ బాపు మ్యూజియంలో నిక్షిప్తపరచామన్నారు. ఈ ప్రాంతాన్ని చారిత్రక ప్రదేశంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పురావస్తు శాఖ దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా ఈ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయించాలని మునిసిపల్ కార్యాలయానికి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ ప్రాంతం మొత్తం 35 సెంట్లు భూమి ఉండాలన్నారు. చాలా వరకూ ఈ స్థలం అన్యాక్రాంతమైందని తెలిసి ఈ స్థలాన్ని కొలత కొలిచి అప్పగించచాలని తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు చేశామని అన్నారు. ఈ స్థలాన్ని శుభ్రం చేసి ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. సమాచార హక్కు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ దుర్గాప్రసాద్ అన్యాక్రాంతమవుతున్న ఈ గోరీలగుంట ప్రాంతాన్ని పరిశీలించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని పురావస్తు శాఖ అధికారులకు ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారని తెలుస్తుంది.

స్వప్రయోజనాల కోసమే పొత్తు

పెనుగొండ: రాష్ట్ర ప్రయోజనాలకు కాకుండా టీడీపీ, జనసేన, బీజేపీలు స్వప్రయోజనాలకే పొత్తు పెట్టుకున్నాయని రాష్ట్ర విద్య సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణు మాధవ రెడ్డి విమర్శించారు. ఆదివారం పెనుగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఒకరిన్ని ఒకరు తిట్టుకుంటూ తన్నుకొన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అడుగు పెట్టనివ్వనంటూ సాక్షాత్తూ కేంద్ర హోంమంత్రిపై రాళ్లు వేయించిన ఘన చరిత్ర చంద్రబాబుదని, రెండు పాచిపోయిన లడ్డూలు ఇచ్చారంటూ దేశ ప్రధానిని విమర్శించిన నిలకడలేని వ్యక్తిత్వం పవన్‌దని విమర్శించారు. వీరికి ప్రజల సంక్షేమం అవసరం లేదన్నారు. అధికారం కోసం అనైతిక పొత్తులతో కలిసారన్నారు. దోచుకోవడం.. పంచుకోవడం.. దాచుకోవడం తప్ప వీరికి రాష్ట్ర అభివృద్ధి అవసరం లేదన్నారు. ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీని ఓడించలేరని, సీఎం జగన్‌ను తట్టుకోలేరన్నారు. ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా ఉన్నారని, రాబోయే రోజుల్లో తేటతెల్లం అవుతుందన్నారు.

30న రన్ ఫర్ జీసస్

నరసాపురం: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ప్రతీఏటా నిర్వహిస్తోన్న రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం ఈ నెల 30న నరసాపురంలో నిర్వహిస్తున్నట్టు కార్యక్రమం కో–ఆర్డినేటర్ సంజయ్‌కిషన్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు థామస్‌బ్రిడ్జి వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో అనేక మంది పాస్టర్లు, క్రైస్తవ ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. క్రీస్తు పునరుద్ధాన మహిమను వివరిస్తూ రన్‌ఫర్ జీసస్ పేరుతో సాగే 10కే రన్‌ను 2011 సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నామని చెప్పారు. నరసాపురం ప్రాంతంలో క్రైస్తవానికి విశిష్టత, శతాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నరసింహరాజుకు ఘన నివాళి



కొంతేరులో మాజీ సర్పంచ్ ముదునూరి నరసింహరాజుకు నివాళులర్పిస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

యలమంచిలి: కొంతేరు మాజీ సర్పంచ్ ముదునూరి నరసింహరాజు మరణించారు. ఈ సందర్భంగా స్థానిక పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిరం ప్రాంగణంలో ఆదివారం యూత్ క్లబ్ సభ్యులు సంతాప సభ నిర్వహించారు. సభలో యూత్ క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేయడమే కాకుండా గ్రామంలో ప్రతి సంవత్సరం నిర్వహించే నాటిక పోటీలకు ప్రధాన దాతగా అనేక మంది కళాకారులను ప్రోత్సాహించిన ఘనత నరసింహరాజుదని కొనియాడారు. కార్యక్రమంలో ఆయన కుమారుడు ముదునూరి నాగ రమేష్ స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ జక్కంశెట్టి సుభాష్ చంద్రబోస్ యూత్ క్లబ్ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు కొంతేటి సర్వేశలింగం, పులపర్తి పెద వెంకటరత్నం, పోలుకొండ ఏలియా భక్తసింగ్, అడ్డాల సత్యనారాయణ, వర్ధనపు సూర్యనారాయణ, మంచెం నరసింహారావు, పిన్నం రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

కవి బ్రహ్మయ్యకు సాహితీ పురస్కారం



బ్రహ్మయ్యను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: తనలో చెలరేగిన అనేక బావ సంఘర్షణలకు అక్షరరూపం ద్వారా వచ్చిన కవిత్వాలను ఆదరించిన పాఠకులకు, సాహితీ వేత్తలకు ప్రముఖ కవి కొప్పర్తి వేంకట రమణమూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు భవనంలో రసధుని ఆధ్వర్యంలో పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక సాహితీ పురస్కార సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొప్పర్తి వెంకట రమణమూర్తికి పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక సాహితీ పురస్కారం అందించారు. కొప్పర్తి మాట్లాడుతూ సాహిత్య రంగంలో తాను చేసిన సేవలను గుర్తించి తనకు ఈ పురస్కారం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రసధుని సభ్యులు కొట్టి భాస్కరరావు, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, యర్రంశెట్టి వెంకటరత్నం, పెనుమాక రామ్మోహనరావు, భూపతిరాజు విశ్వనాథరాజు, రెంటాల వెంకటేశ్వరరావు, సుంకర గోపాల్, డాక్టర్ వర్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపిని అభినందిస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పని చేయాలని ఆ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) పిలుపునిచ్చారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజా ప్రతినిధులు, ఆలయాల చైర్మన్‌లు గుడాల గోపిని కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో పాలకొల్లు నుంచి గెలిచి రావాలని ఆశీర్వదించి పంపించారన్నారు. పార్టీ ముఖ్య నాయకులందరినీ సమన్వయం చేసుకుని ఎన్నికల ప్రచారం చేస్తానన్నారు. రానున్న రెండు నెలలు తన విజయం కోసం కీలకంగా పని చేయాలన్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి నామినేటెడ్, ఇతర పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అంబేడ్కర్ సేన కార్యకర్తలు ర్యాలీగా వచ్చి గోపిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. అలాగే శంభునిపేటలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శంభునిపేటలో పెద్దలను కలిసి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, శ్రీకనక దుర్గమ్మ దేవస్థానం చైర్మన్ కావలి శ్రీనివాసరావు, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు ఎం.మైఖేల్‌రాజు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోట రత్నరాజు, గుమ్మాపు సూర్యవరప్రసాద్, శంకరావు శ్రీను, జోగాడ ఉమామహేశ్వరరావు, ఉచ్చుల స్టాలిన్, బళ్ల రాజశేఖర్, పసుపులేటి వీరాస్వామి తదితరులు గోపిని కలిసిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి పోడూరులో శ్రీరంగనాథరాజు ఎన్నికల ప్రచారం

పోడూరు: మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు సోమవారం మధ్యాహ్నం 2గంటల నుంచి పి.పోలవరం, జగన్నాథపురం గ్రామాల్లో ఎన్నికల శంఖారావం పాదయాత్ర నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


నైపుణ్యం ద్వారా ఉద్యోగాలు



విష్ణు కళాశాల వార్షికోత్సవాల్లో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యాల అలవర్చుకోవడం ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ అన్నారు. విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వార్షికోత్సవాల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సొసైటీలో 10 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని సత్కరించారు. అనంతరం జేఎన్‌టీయూకే పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేణు, కళాశాల డైరక్టర్ దశిక సూర్యనారాయణ, అడ్మిన్ ప్రసాదరాజు, ఏజీఎం రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



పెనుగొండ: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థుల కెరీర్‌కు కీలకమైన పదవ తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 18 నుంచి 30 వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి. రెగ్యులర్ పరీక్షలు 28తో పూర్తయినా ఒకేషనల్ కోర్సులు మరో రెండు రోజులు ఉండడంతో 30 వరకూ పరీక్షలు జరుగనున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 4395 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు వ్రాయనున్నారు. పరీక్షల సమయం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 వరకూ జరగనున్నాయి. పాలకొల్లులో పట్టణంలో రైల్వే గేటు వద్ద పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బిఆర్‌ఎంవి మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 300, యడ్ల బజారు సెంటర్ వద్ద ఎంఎంకెఎన్‌ఎమ్ మునిసిపల్ హైస్కూల్ 300, హౌసింగ్ బోర్డు కాలనీ టిటిడి కళ్యాణ మండపం పక్కన సుబాష్ చంద్రబోస్ మునిసిపల్ హైస్కూల్ 150, చిన్న కూరగాయల మార్కెట్ వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న బివిఆర్ మునిసిపల్ గరల్స్ హైస్కూల్ 300, దొడ్డిపట్ల రోడ్డులో ఏఎస్‌ఎన్‌ఎం కళాశాల దాటిన తరువాత సెంట్‌మెరిస్ హైస్కూల్ 230, బ్రాడపేట వంతెన కాలువ దాటిన తరువాత నాగరాజు పేటలో ఉన్న గురుకుల పాఠశాలలో 150, బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న ఆదిత్య పబ్లిక్ స్కూల్లో 230, బ్రాడీపేట రామచంద్ర గార్డెన్స్ దాటిన తరువాత శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో 240, పూలపల్లి మలుపులో ఉన్న గౌతమి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో 240, పాలకొల్లు మండలంలో లంకలకోడేరు గ్రామంలో జెడ్పీ హైస్కూల్ (ఏ సెంటర్)లో 240, లంకలకోడేరు జెడ్పీ హైస్కూల్ (బి సెంటర్)లో 280, శివదేవుని చిక్కాల జెడ్పీ హైస్కూల్లో 120, యలమంచిలి మండలంలో యలమంచిలి జెడ్పీ హైస్కూల్లో 325, కాజ జెడ్పీ హైస్కూల్లో 240, దొడ్డిపట్ల జెడ్పీ హైస్కూల్లో 200, మట్లపాలెం జెడ్పీ హైస్కూల్లో 140, ఏనుగువాని లంక జెడ్పీ హైస్కూల్లో 180, పోడూరు మండలంలో పోడూరు జెడ్పీ హైస్కూల్లో 182, జిన్నూరు జెడ్పీ హైస్కూల్లో 185, గుమ్ములూరు జెడ్పీ హైస్కూల్లో 163 మంది విద్యార్థులు పరీక్షలు రయానున్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థుల సౌలభ్యం కొరకు మెడికల్ క్యాంపులు, ఓఆర్‌ఎస్ ద్రావణం, తాగునీరు వంటివి అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ–1 గుమ్మళ్ల వీరాస్వామి తెలిపారు.



పాలకొల్లు సెంట్రల్: ఎంఎంకేఎన్ మునిసిపల్ హైస్కూల్లో విద్యార్థుల హాల్ టిక్కెట్ల నెంబర్లతో సిద్ధంగా ఉన్న తరగతి గది



నరసాపురం రూరల్: ఎల్బీచర్ల గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నరసాపురంలో..

నరసాపురం రూరల్: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నరసాపురం పట్టణంలో ఏడు, మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పా టు చేసినట్లు ఎంఈవో పుష్పరాజ్యం తెలిపారు. నరసాపురం మండలంలోని 11జిల్లాపరిషత్ పాఠశాలలు, 4ఎయిడెడ్ పాఠశాల లు, 5 మున్సిపల్ పాఠశాలలు, 3 గురుకుల పాఠశాలలు, పట్టణంలోని ఒక ప్రభుత్వ బాలికల పాఠశాల, 15 ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాటు చేశామన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షల్లో మండలంలోని 39 పాఠశాలలకు చెందిన 1,894 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు వైద్య, తాగునీటిసౌకర్యాలు కల్పించామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పదో తరగతి పరీక్షలకు ఆచంట నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 30 వరకూ కొనసాగనున్నాయి. పెనుగొండ మండలంలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 1480 మంది, ఆచంట మండలంలో 528 మంది, పెనుమంట్ర మండలంలో 429 మంది, పోడూరులో 448 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అనువుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. సమస్యాత్మకంగా ఉన్న పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రకటించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారంగా పరీక్షలు పక్కా ప్రణాళికతో నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేశామని ఆచంట మండల విద్యాశాఖాధికారి ఏ ఉషారాణి తెలిపారు.